AKSHARA TODAY

అక్షరటుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

22-9-2026 (Tuesday)

MAIN EDITION

గ్యాస్ నిల్వలపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన



అక్షరటుడే, ఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ (వంటగ్యాస్) సిలిండర్లకు తీవ్ర కొరత ఏర్పడుతుందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి స్పష్టతనిచ్చారు. ఆ వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని ఆయన తేల్చిచెప్పారు. దేశంలో గ్యాస్ కొరత తలెత్తకుండా ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుందని భరోసానిచ్చారు.

ఏపీ స్థానిక ఎన్నికల్లో సంచలన పరిణామాలు



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమరం వేడెక్కుతోంది. ఈ లోకల్ వార్‌ను కూటమి పార్టీలు ప్రభుత్వ పనితీరుకు ఒక పరీక్షలా భావిస్తున్నాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆయన సొంత ఇలాకాలోనే రాజకీయంగా ఇరుకున పెట్టేందుకు అధికార కూటమి పావులు కదుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఇందులో భాగంగా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డిని రంగంలోకి దించేందుకు మంత్రి నారా లోకేశ్ ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

డెయిరీ యూనిట్లలో తనిఖీలు



అక్షరటుడే, హైదరాబాద్ : ఆహార భద్రతా విభాగం అధికారులు హయత్ నగర్‌లోని డెయిరీ యూనిట్లు, పంపిణీ కేంద్రాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పాల నమూనాలను సేకరించారు. సరైన లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తూ, అపరిశుభ్రమైన పరిస్థితులను కలిగి ఉన్న ఒక సంస్థను మూసివేయించారు.

తిరుమలలో చిరుత కలకలం




అక్షరటుడే, ఏపీ : తిరుమలలోని అలిపిరి నడక మార్గంలో చిరుత కనిపించింది. తరచూ 7వ మైలు నుంచి నరసింహస్వామి ఆలయం మధ్య ప్రాంతంలో చిరుత సంచరిస్తోంది. దీంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం 2800వ మెట్టు దగ్గర చిరుతపులి కనిపించింది.

అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు



అక్షరటుడే, హైదరాబాద్ : అక్టోబర్ నుంచి కొత్త పెన్షన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. దసరాకు ముందే కొత్త పెన్షన్లు అందేలా చూడాలని ఆదేశించింది. వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని అధికారులకు సూచించింది.

రిమ్స్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం



ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. చిన్నారుల వార్డులో అగ్ని ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి ఒక్కసారిగా పొగలు కమ్ముకోవడంతో శిశువుల కుటుంబ సభ్యులు భయంతో వారిని తీసుకొని బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు శిశువులు మృతి చెందారు. 24 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏసీ పేలడంతో అగ్ని ప్రమాదం జరిగింది.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ ఎన్ఐసీయూ విభాగంలో ఘటన ■ ముగ్గురు చిన్నారుల మృతి ■ చికిత్స పొందుతున్న పలువురు ■ విచారణకు ఆదేశించిన సీఎం

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో సోమవారం అర్ధరాత్రి చిన్నారుల వార్డులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ పేలడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ఈ ఘటనలో మొదట ఐదు రోజుల శిశువు మృతి చెందగా, మరో 24 మంది చిన్నారులను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. వారిలో ఓ శిశువు స్థానికంగా ఆస్పత్రిలో చనిపోగా.. మరొక పాప నిజామాబాద్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయింది. పలువురు చిన్నారులు ఆదిలాబాద్, నిజామాబాద్‌లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేసి..

రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ వార్డులో అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా ఏసీ నుంచి పొగలు రావడంతో తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే తమ చిన్నారులను తీసుకుని వార్డు నుంచి బయటకు పరుగులు తీశారు. అప్రమత్తమైన ఆసుపత్రి సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి చిన్నారులను పక్క వార్డుకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది రిమ్స్‌కు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కలెక్టర్ రాజర్షి షా రిమ్స్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న కూడా ఆసుపత్రికి చేరుకుని ఘటన వివరాలను తెలుసుకున్నారు.

కేంద్ర మంత్రి దిగ్భ్రాంతి

ప్రమాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యతను నిర్ధారించి, ఏదైనా నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో, ముఖ్యంగా నవజాత శిశు, పిల్లల వార్డులలో ఫైర్ సేఫ్టీ విషయంలో ఎటువంటి రాజీకి తావులేదన్నారు.

విచారం వ్యక్తం చేసిన సీఎం

రిమ్స్ ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో చిన్నారులు మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్



అక్షరటుడే, మహబూబ్‌నగర్ : జూరాల ప్రాజెక్టు వద్ద నీళ్లు లేక ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. జడ్చర్ల వద్ద ఆయన వాహనాన్ని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తనను అడ్డుకుని, అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికం అని రామ్‌చందర్‌రావు అన్నారు. రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వెళ్తుంటే మార్గమధ్యంలోనే అడ్డుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ నివాసాల్లో ఏసీబీ దాడులు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల మేరకు నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్‌పై ఏసీబీ దాడులు చేపట్టింది. మంగళవారం ఉదయం ఏకకాలంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తోంది. లక్ష్మీ భాస్కర్ ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారని ఏసీబీ సమాచారం అందింది. దీంతో ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదు చేసి తనిఖీలు చేపట్టారు. మూడు జిల్లాల్లోని 12 ప్రదేశాల్లో ఏక కాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. మూసాపేటలోని కల్పతరు రెసిడెన్సీలో భాస్కర్ నివాస ప్రాంతంలో, అలాగే ఆయనకు సంబంధించిన ఇతర ఆస్తులలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

గణేశ నిమజ్జనం కోసం.. స్పెషల్ ఎంఎంటీఎస్ రైళ్లు



అక్షరటుడే, సికింద్రాబాద్ : హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకను చూసేందుకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు 25, 26, 27 తేదీల్లో రాత్రిపూట ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. సికింద్రాబాద్ నుంచి హైదరాబాద్, హైదరాబాద్-లింగంపల్లి, లింగంపల్లి-హైదరాబాద్, హైదరాబాద్-సికింద్రాబాద్, హైదరాబాద్-లింగంపల్లి, లింగంపల్లి-ఫలక్‌నుమా, ఫలక్‌నుమా-సికింద్రాబాద్, సికింద్రాబాద్-హైదరాబాద్ మార్గాల్లో ఎంఎంటీఎస్ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య వీటిని నడపనున్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



అక్షరటుడే, ఏపీ : తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారి రథోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగారు. ఉభయదేవేరులతో స్వామివారు రథంపై మాడ వీధుల్లో విహరించారు. ఈ వేడుక చూడటానికి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చారు. గ్యాలరీలు అన్ని నిండిపోయాయి. స్వామి వారు రథంపై దర్శనం ఇస్తుండగా.. భక్తులు గోవింద నామ స్మరణతో పరవిశించిపోయారు. రథోత్సవం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.



ఓయో హోటల్‌లో యువతి మృతి

అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ధిఖీ నగర్ రోడ్డు నంబర్ 5లోని ఓయో హోటల్‌లో విశాఖపట్నానికి చెందిన షారన్ నిఖిత టోప్పో అనే యువతి అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. ఆమెను ప్రియుడే హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిఖిత, తన ప్రియుడు శ్రీనివాస రవి తేజతో కలిసి నగరానికి చేరుకుంది. అనంతరం ఓయో రూమ్‌కు వచ్చారు. . రాత్రి 1 గంట ప్రాంతంలో యువతి అపస్మారక స్థితికి చేరుకోవడంతో, శ్రీనివాస రవి తేజ కొండాపూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తేల్చిచెప్పారు.

పెళ్లిళ్ల పేరిట మోసం.. నిందితుడిపై పీడీ యాక్ట్

అక్షరటుడే, మల్కాజ్‌గిరి : పెళ్లిళ్ల పేరిట మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై సైబరాబాద్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంద వెంకట కామేష్ అలియాస్ కార్తీక్‌రెడ్డి అనే వ్యక్తి బీటెక్ చదివాడు. తను ఎన్ఆర్ఐని అని మ్యాట్రిమోని సైట్‌లలో నమోదు చేసుకునేవాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మహిళలను నమ్మించేవాడు. అనంతరం అత్యవసరంగా డబ్బులు కావాలని తీసుకొని పరారు అయ్యేవాడు. 2021 నుంచి నిందితుడు 19 మోసాలకు పాల్పడ్డాడు. దీంతో తాజాగా పోలీసులు పీడీ యాక్ట్ పెట్టారు.





ఉత్కంఠ పోరులో భారత్ విజయం

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : జపాన్‌తో జరిగిన ఏకైక టీ20లో భారత్ విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ అభిషేక్ శర్మ డక్ అవుట్ అయ్యాడు. భారత్ 5 ఓవర్లలో 32 పరుగులు మాత్రమే చేసింది. అయితే భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జపాన్ నిర్ణిత ఓవర్లలో 30 పరుగులు మాత్రమే చేసింది. చివరి ఓవర్‌లో జపాన్ గెలుపు కోసం 8 పరుగులు అవసరం అయిన సమయంలో అక్షర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి భారత్‌కు విజయం అందించాడు.

ఆసియా గేమ్స్ ఫైనల్‌లో భారత్ ఘన విజయం

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా గేమ్స్‌లో జరుగుతున్న టీ 20 ఫైనల్‌లో భారత మహిళల జట్టు ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత ఖాతాలో తొలి గోల్డ్ మెడల్ చేరింది. భారత ప్లేయర్లు సమష్టి ప్రదర్శనతో ఘన విజయం సాధించారు. మొదట బ్యాటర్లు చెలరేగడంతో భారత్ 216 భారీ స్కోర్ చేసింది. 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంక జట్టు ఆది నుంచి ఏ దశలోనే ఆధిపత్యం చూపట్టలేకపోయింది. 18 పరుగులకు తొలి వికెట్ కోల్పోయిన ఆ జట్టు, వరుస విరామాల్లో వికెట్లు చేజార్చుకుంది. దీంతో 69 పరుగులకే ఆలౌట్ అయింది. 147 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది.

